# 3. ఆదర్శమైన జంట

సీతకు సంబంధాలు వెతుకుతున్నారు. పిల్ల చక్కనిది. బుద్ధిమంతురాలు. సంగీతం వింటుంటే అన్నమూ, నీళ్లూ కూడా అక్కర్లేదు. ఇంక పుస్తకాలు ఎన్ని వందలు చదివిందో చెప్పలేను. నా దగ్గిర ఉన్న పుస్తకాలన్నీ నేను చదివానని చెప్పలేను గాని, సీత అన్నీ చదివింది.

సీతకు మంచి సంబంధం రావాలని నాకూ తహతహగానే ఉన్నది.

ఒకరోజు సీత తండ్రి మాఇంటికొచ్చి "అమ్మాయికి అద్భుతమైన సంబంధం చూస్తున్నామయ్యా? అయేట్టే ఉంది" అన్నాడు.

"ఎవరబ్బాయి? ఏం చేస్తాడు? ఎంత వయసు?" వగైరా ప్రశ్నలు వేశాను.

అన్నీ బాగానే ఉన్నాయి.

"అన్నట్టు ఆ అబ్బాయి చక్కగా పాడతాట్ట! రేడియోలో అప్పుడప్పుడూ పాడిస్తూంటారు," అన్నాడు సీత తండ్రి.

నా బుర్రలో అలారం మోగింది.

"తరవాత పత్రికల్లో కథలూ గట్రా రాస్తాట్ట?"

నేను ఇంక వినదలుచుకోలేదు.

"శంకరం, సీతకు ఈ సంబంధం వొద్దు", అన్నాను.

శంకరం కళ్లు పెద్దవిచేసి, "అదేవిటి ... అన్నివిధాలా ... ఇంతకన్న మంచి సంబంధం..." అన్నాడు.

నేను సీతకు ద్రోహం తలపెట్టానన్న ఆలోచనను అతి కష్టంమీద అణచుకుంటున్నట్లు కనపడ్డాడు.

"మరేమీ లేదు. ఈ సంబంధం చేస్తే సీత జన్మలో సంగీతం వినదు. పుస్తకాలు చదవదు. దానికి సిద్ధమైతే చేసెయ్యి" అన్నాను.

*కొడవటిగంటి కుటుంబరావు*